యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదుగాలి

- కరీంనగర్ డెయిరీ అధినేత చల్మెడ రాజేశ్వర్ రావు

సదస్సులో మాట్లాడుతున్న చల్మెడ రాజేశ్వర్ రావు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 12 : యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదుగాలని, దేశంలో ఉన్న అనువైన వాతావరణాన్ని ఉపయోగించుకొని, స్వావలంబనే అంతిమ లక్ష్యంగా ముందుకుసాగాలని కరీంనగర్ డెయిరీ అధినేత చల్మెడ రాజేశ్వర్ రావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(ఔత్సాహికత) అభివృద్ధిపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. డెయిరీ పరిశ్రమ ద్వారా తాను వేల మందికి ఉపాధి కల్పిస్తున్నానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు వికసిత్ భారత్‌లో భవిష్యత్తు ఔత్సాహికులుగా మారాలని పేర్కొన్నారు. స్వదేశీ జాగరణ ముంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ సీఏ హరీశ్ బాబు, వక్తలు సీహెచ్ రమణ మూర్తి, తిరుమల ఇండస్ట్రీస్ ఎండీ ఎం రఢేష్, చిటీ మాధవ రావు, ఎం దామోదర్ రెడ్డి విద్యార్థులకు ఔత్సాహికతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ బూర్ల నరేశ్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ హర్ప్రీత్ కౌర్, సభ్యులు డాక్టర్ ప్రభాకర్, శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన తెలంగాణ ఎరుకల ప్రజా సమితి నాయకులు

తెలంగాణచౌక్, నవంబర్12: ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు పోచయ్యతో పాటు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన మహిళలు, యువకులు దీక్షలో కూర్చున్నారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. దీక్షలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర కార్యదర్శి సాగర్, జిల్లా గౌరవాధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు సంపత్, కనకయ్య, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

చిగురుమామిడి, నవంబర్ 12: చిగురుమామిడి, ముల్కనూర్ వరి ధాన్యం కేంద్రాలను మంగళవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఇక్కడ తహసీల్దార్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ ఉన్నారు.

హైనా దాడిలో లేగ దూడ మృతి

చిగురుమామిడి, నవంబర్ 12: నవాబుపేట గ్రామంలో రైతు పూతరవేణి సంపత్‌కు చెందిన లేగదూడ హైనా దాడిలో మృతిచెందింది. ఆయన రోజు వారిలాగే పొలం వద్ద పశువుల పాకలో లేగ దూడను కట్టి ఉంచగా, మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి చనిపోయి ఉంది. మండల పశువైద్యాధికారి విజయభాస్కర్, ఫారెస్ట్ బీట్ అధికారి శేఖర్‌కు సమాచారం అందించగా, వారు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. లేగదూడ హైనా దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన లేగ దూడ విలువ సుమారు 25 వేల నుంచి 30 వేల వరకు ఉంటుందని, రైతు సంపత్‌కు పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.

తాగునీరు.. రోడ్డుపాలు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 12: పట్టణంలోని అయ్యప్ప ఆలయం ఎదురుగా జమ్మికుంట రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ కావడంతో నీరు వృథాగా పోతున్నది. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్టిక్కరింగ్ లేకున్నా సర్వే

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- ఆధారాలు చూపడం ఐచ్ఛికమే
- వాస్తవాలు మాత్రమే అందించాలి
- సోమవారం నాటికి 60,400 ఇండ్లు పూర్తి
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 12: సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక సర్వేలో భాగంగా జిల్లాలో నిర్వహించిన హౌస్ హోల్డ్ కార్యక్రమంలో స్టిక్కరింగ్ చేయని ఇళ్లు కూడా సర్వే చేయనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా వివిధ మండలాల్లో పర్యటిస్తున్న కలెక్టర్, ఇతర అధికారుల వద్ద ప్రజలు వ్యక్తం చేస్తున్న అనుమానాలకు మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమాధానాలు చెప్పారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్‌లో ప్రభుత్వం పలు ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసేందుకే సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి యజమానికి ఇష్టమైతేనే సర్వేలో ఎన్యుమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఆధారాలు చూపాలన్నారు. ఎలాంటి బలవంతం లేదని విస్పష్టంగా తెలిపారు. 2011లో నిర్వహించిన సర్వే ఆధారంగానే తాజాగా ఇళ్ల గుర్తింపు కోసం స్టిక్కరింగ్ చేసినట్లు చెప్పారు. దీని ప్రకారం జిల్లాలో 1958 ఎన్యుమరేషన్ బ్లాకులు ఉండగా, కొత్తగా 730 ఈబీలు పెరిగాయన్నారు. గతంలో 150 ఇళ్లకు ఒక ఈబీని నిర్ధారించగా, ప్రసుతం 175 ఇళ్లకొక ఈబీగా జాబితా రూపొందించామన్నారు. ఈ ఇళ్లలో అదనంగా కుటుంబాలు ఉంటే బైనంబర్లతో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 3.30 లక్షల ఇళ్లు జిల్లాలో సర్వే చేయబోతుండగా, సోమవారం నాటికి 60,400 ఇండ్లు, 18 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రజలు సర్వేకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని, నిర్దేశించిన గడువులోగా వందశాతం సర్వే పూర్తి చేయనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఈబీకి ఒక ఎన్యుమరేటర్ చొప్పున జిల్లావ్యాప్తంగా 2,700 మంది ఎన్యుమరేటర్లను సర్వే కోసం వినియోగిస్తున్నామన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 20 ఇళ్ల చొప్పున పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లకు ఎలాంటి ఒరిజినల్, జిరాక్స్ ప్రతులు కూడా అందజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కుటుంబ యజమానులు అందుబాటులో లేకున్నా, డోర్‌లాక్ ఉన్నా ఎన్యుమరేటర్ మరోసారి వచ్చి వివరాలు సేకరిస్తారని వివరించారు. ఒకే ఇంటిలో ఎంతమంది వేర్వేరుగా నివాసమున్నా, వారికి వేర్వేరుగా ఫారాలు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సర్వేపై సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ముఖ్యప్రణాళిక అధికారి కొమురయ్య, తదితరులు ఉన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

కొత్తపల్లి, నవంబర్ 12 : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న శాఖ గ్రంథాలయాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్యదర్శి ఏ సరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభమవుతాయని, ఆ రోజు 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు పర్యావరణ అంశంపై చిత్రలేఖన పోటీలు, మెమోరి గేమ్స్ నిర్వహిస్తామని తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు భారతదేశ పుణ్యక్షేత్రాలు, కళాశాల విద్యార్థులకు నూతన విద్యా విధానం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 16న 7, 8వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు, 17న ఉన్నత పాఠశాల విద్యార్థులకు మేకిన్ ఇండియా, కళాశాల విద్యార్థులకు ప్రపంచ శాంతి భారతదేశ పాత్ర అనే అంశాలపై వక్తృత్వ పోటీలు, 18న పాఠశాల, కళాశాల విద్యార్థులకు దేశ భక్తి, జానపద గేయాలపై పాటల పోటీలు, 19న పాఠశాల, కళాశాల విద్యార్థినులకు రంగోళి పోటీలు, 20న వారోత్సవాల ముగింపు ఉత్సవం, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి

హుజూరాబాద్ టౌన్, నవంబర్12: సోలార్ విద్యుత్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కార్పొరేషన్ డిప్యూటీ మేనేజర్ టి. ముత్తు కుమారన్ పిలుపునిచ్చారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కళాశాలలో జరుగుతున్న ఏఐసీటీఈ ప్రయోజిత అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు మంగళవారం ఆయన హాజరై శిక్షణ ఇచ్చారు. సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. నాగపూర్‌కు చెందిన విశ్వేశ్వరయ్య ఎన్ ఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ షా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ యోగేష్ పుండలీక్, డాక్టర్ ఏ కొమురయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

కలెక్టరేట్, నవంబర్ 12 : ఈనెల 17, 18 తేదీల్లో జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరాన్ని స్ట్రాంగ్ రూమ్‌గా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, గది పొడవు, వెడల్పు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కె.మహేశ్వర్, తదితర అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

తెలంగాణచౌక్, నవంబర్12: కరీంనగర్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని పీఆర్‌టీయూ అభ్యర్థి వంగల మహేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పోల్ టూ పోల్ తనిఖీలు

హుజూరాబాద్ రూరల్(హుజూరాబాద్ టౌన్), నవంబర్ 12: చెల్పూర్ గ్రామంలో విద్యుత్ అధికారులు మంగళవారం పోల్ టూ పోల్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ రూరల్ ఏఈ జనార్దన్ మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఏఈ రాములు, ఏఈలు సంపత్ రెడ్డి, రఘుచారి, ఫోర్‌మెన్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తపల్లి, నవంబర్ 12 : సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద ఎంపిక చేసిన 169 ప్రభుత్వ పాఠశాలల్లో క్లాసులు నిర్వహించేందుకు దరఖాస్తు గడువు ఈనెల 16 వరకు పొడిగించినట్లు జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వీ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద సెలెక్ట్ అయిన పాఠశాలల్లో నవంబర్ 2024 నుంచి జనవరి 2025 వరకు మూడు నెలల్లో 36 సెషన్స్ క్లాసులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన ట్రైనర్స్‌కు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 16లోగా తమ దరఖాస్తులను డీవైఎస్‌వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కలెక్టర్‌పై దాడి హేయనీయం: ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ దారం

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

కలెక్టరేట్, నవంబర్ 12 : విధి నిర్వహణలో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడం అత్యంత హేయనీయమని ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దాడి ఘటనపై కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీజీవో నాయకులు మడిపల్లి కాళీచరణ్, నాగుల నర్సింహస్వామి, డీటీవో నాగరాజు, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, మల్కా రాజేశ్వర్‌రావు, సర్దార్ హర్మిందర్‌సింగ్, సుమంత్‌రావు, నేరెళ్ల కిషన్, రాజేశ్ భరద్వాజ్, డీటీవో కొండయ్య, విజయ్, పోలు కిషన్, బల్బీర్‌సింగ్, జలాలుద్దీన్, అక్బర్, భూమన్న, హస్టర్ ప్రవీణ్‌రావు, రాజిరెడ్డి, ఖాజామొయినొద్దీన్, సత్యం, శ్రీనివాస్, కర్ణాకర్, సుధాకర్‌రెడ్డి, వాస్తవిక్ రవి, జడ కరుణాకర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, కమ్రుద్దీన్, కమలేశ్, సోమన్న, మహిళా జేఏసీ అధ్యక్షురాలు శారద, సబిత, సరిత, శైలజతో పాటు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయాల ఎదుట నిరసన

జమ్మికుంట/ హుజూరాబాద్ టౌన్/ మానకొండూర్ రూరల్, నవంబర్12: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ తహసీల్ కార్యాలయాల ఎదుట రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిరసన తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూర్ తహసీల్ కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. దాడులను ఖండించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు కే కనకయ్య, రమేశ్‌బాబు, రాజేశ్వరి, డీటీలు, ఆర్ఐలు, కార్యాలయ సిబ్బంది, తదితరులున్నారు.

దాడి అమానుషం: తెలంగాణ ఉద్యోగుల సంఘం

తెలంగాణచౌక్, నవంబర్12: ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఉద్యోగులపై దాడి చేయడం అమానుష చర్యని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్ అన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ నాగేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

జమ్మికుంట, నవంబర్12: మున్సిపల్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉంటాయని, వాటికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 21వ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 30 వార్డుల్లో మిగిలి పోయిన పనుల కోసం రూ.కోటి నిధులు మంజూరు చేశామని, పనులను ఇటీవల ప్రారంభించామని చెప్పారు. అంతేకాకుండా డ్రైనేజీ పనులకు రూ.20లక్షలు కేటాయించామని తెలిపారు. ఇక మిషన్ భగీరథ నీరు వృథాగా రోడ్లపై విడిచి పెడుతున్నారని, ప్రజలు నీటిని సంరక్షించుకోవాలని సూచించారు. ఆయన వెంట అధికారులు, స్థానిక నాయకులు, తదితరులున్నారు.

ఏఎంసీ నూతన పాలకవర్గాల నియామకం

హుజూరాబాద్ టౌన్/జమ్మికుంట,నవంబర్ 12: హుజూరాబాద్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హుజూరాబాద్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గూడూరి రాజేశ్వరి, వైస్ చైర్మన్‌గా నాంపెల్లి తిరుపతి నియమితులయ్యారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వావిలాల మాజీ ఎంపీటీసీ పుల్లూరి స్వప్నాసదానందం, వైస్ చైర్మన్‌గా ఎర్రం సతీశ్ రెడ్డితో పాటు 16 మంది డైరెక్టర్లను నియమించారు.

తల్లికి విరాసత్ చేయొద్దని కొడుకు ఆత్మహత్యాయత్నం

మానకొండూర్ రూరల్, నవంబర్ 12: తండ్రి ఆస్తిని తల్లి పేరున విరాసత్ (సక్సేషన్) కాకుండా ఉండేందుకు కొడుకు ఆత్మహత్యకు యత్నించి దవాఖానలో చేరిన ఘటన మండలంలోని దేవంపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దేవంపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ లక్ష్మయ్య మరణించగా, ఆయన పేరున గ్రామ శివారులో ఉన్న 3 ఎకరాల 12 గుంటల భూమిని భార్య రాజమ్మ తన పేరున విరాసత్ (సక్సేషన్) చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకుంది. లక్ష్మయ్యకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడైన కొయ్యడ రవి తల్లి రాజమ్మకు విరాసత్ చేయవద్దని శుక్రవారం తహసీల్దార్ రాజేశ్వరిని కలిసి విన్నవించాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు అందరూ కలిసి రావాలని ఆయనకు తహసీల్దార్ సూచించారు. మంగళవారం విరాసత్ చేసుకునేందుకు రాజమ్మ రాగా, తల్లికి విరాసత్ చేయవద్దని, రవి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గడ్డి మందు తాగే ప్రయత్నం చేశాడు. వెంటనే అక్కడ ఉన్న వారు అడ్డుకున్నారు. తహసీల్దార్, అక్కడ ఉన్న రైతులు 108 వాహనంలో దవాఖానకు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా, నామ్స్ ప్రకారం భర్త పేరిట ఉన్న ఆస్తిని భార్యకు విరాసత్ చేయవచ్చన్నారు. అయితే, రాజమ్మ తాను ఇంకా ఇద్దరు బిడ్డలకు పెళ్లిళ్లు చేయాల్సి ఉందని, పెద్ద కొడుకు తమను పట్టించుకోడు అని చెప్పడంతో అందరూ కలిసి మాట్లాడుకోవాలని సూచించానన్నారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

శంకరపట్నం, నవంబర్ 12: మొలంగూర్ శివారులో విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లోని పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి మొలంగూర్ శివారులోని ఓ రైతుకు చెందిన పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఎస్సారెస్పీ డీబీఎం-13 కాలువ పక్కన వెళ్తుండగా పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు పశుగ్రాసానికి తగిలి మంటలు చెలరేగాయి. ట్రాలీలోని పశుగ్రాసం దగ్ధం అవుతుండగా డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి ట్రాలీని విడదీశాడు. పశుగ్రాసం పూర్తిగా దగ్ధం కాగా, ట్రాక్టర్ టైర్లు పాక్షికంగా కాలిపోయాయి.

పదేండ్ల వయసులో తప్పిపోయి.. 30 ఏళ్ల తర్వాత స్వగ్రామానికి

కుటుంబ సభ్యులతో మల్లయ్య

గంగాధర, నవంబర్ 12 : చిన్నతనంలో ఇంటి నుంచి తప్పిపోవడం, ఎక్కడెక్కడో తిరుగుతూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకడం.. పెద్ద అయ్యాక ఇంటి అడ్రస్ వెతుకుంటూ వచ్చి కుటుంబ సభ్యుల కలుపడం లాంటి సన్నివేశాలను సినిమాల్లో మాత్రమే చూస్తాం. కానీ, అచ్చం ఇలాంటి సంఘటనే గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన కచ్చు మల్లయ్య జీవితంలో జరిగింది. మల్లయ్య పదేండ్ల వయసులో ఉండగా ఆయన తల్లి బక్కవ్వకు ప్రమాదం జరుగడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ దవాఖానకు తీసుకువెళ్లారు. కుటుంబ సభ్యులతో దవాఖానకు వెళ్లిన మల్లయ్య, దాహం తీర్చుకోవడానికి బయటికి వెళ్లి తప్పిపోయాడు. తిరిగి దవాఖాన అడ్రస్ దొరుకపోవడంతో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవితాన్ని వెళ్లదీశాడు. వరంగల్‌లో నర్సింహ అనే వ్యక్తి వద్ద పూల దుకాణంలో పని చేస్తుండగా అతడి చెల్లి లక్ష్మితో మల్లయ్య వివాహం జరుగగా, వీరికి కొడుకు జన్మించాడు. కొద్ది సంవత్సరాల తర్వాత మల్లయ్యకు స్వగ్రామం వెంకటాయపల్లిపై ధ్యాస మళ్లింది. తన మిగిలిన జీవితాన్ని స్వగ్రామంలో గడపాలని నిశ్చయించుకున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. 30 ఏండ్ల తర్వాత ఇంటికి వచ్చిన మల్లయ్యను చూసి ఆయన అన్న కొమురయ్య, అక్క కొమురవ్వ, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

పారిశుధ్యంపై పట్టింపేది?

చిగురుమామిడి, నవంబర్ 12: మండల కేంద్రంలో జీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలో పారిశుధ్యం లోపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12వ వార్డులో మురుగు కాలువలో చెత్త పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతున్నదని, దోమల బెడద పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎంఈవోను సన్మానించిన ట్రస్మా నాయకులు

చొప్పదండి, నవంబర్ 12: మండల విద్యాధికారి డి. శ్రీనివాస్‌ను ట్రస్మా మండల అధ్యక్షుడు గుర్రం ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు పుల్యాల లక్ష్మీరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి శ్రీనివాస్, కోశాధికారి కునమల్ల దేవానంద్, ఉపాధ్యక్షుడు తమ్మాడి కనకరాజు, కరస్పాండెంట్లు కడారి రవికుమార్, నాగోతు వినోద్ కుమార్, నాగరాజు, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో 'కిడోస్ న్యాక్'

కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 12 : కొత్తపెల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అల్ఫోర్స్ కిడోస్ న్యాక్ కార్యక్రమాన్ని విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలని, సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని 3, 4, 5వ తరగతి విద్యార్థులు సమాజంలో ప్రభావితం చేసే పలు అంశాలు వివరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్న హన్మాండ్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 12 : జిల్లా కేంద్రంలోని పాతబజార్ చిన్న హన్మాండ్ల ఆలయంలో శివ పంచాయతన ప్రతిష్ఠా అనంతరం కార్తీక ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠితమైన శివలింగానికి, భక్తాంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడ పండితులు మంగళంపల్లి శ్రీనివాసశర్మ, శ్రీధరాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో మిల్లుకు తరలిస్తుండగా కూలిన ధాన్యం బస్తాలు

శంకరపట్నం, నవంబర్ 12: ట్రాక్టర్‌లో మిల్లుకు తరలిస్తుండగా ధ